
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
శుక్రవారం । 29 । మార్చి । 2024



సోమశిలలో 10.18 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో గురువారం సాయంత్రానికి 10.18 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 1270 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.69,180
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,213
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,399
నవర (8గ్రాములు)	రూ.51,192

గరిష్టం/కనిష్టం
35.4 /26.0

వాతావరణం

గాలిలో తేమ 66 శాతంగా గురువారం నమోదైంది. ఉష్ణోగ్రతలు శుక్రవారం కొంత మేర పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.



న్యూస్‌రీల్

పోలింగ్ అధికారులకు శిక్షణ



వీఆర్ లా కళాశాలను పరిశీలిస్తున్న కలెక్టర్

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో ఎన్నికలను సజావుగా నిర్వహించాలనే లక్ష్యంతో పోలింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. నగరంలోని వీఆర్ లా కళాశాల, డీకే డబ్ల్యూ కళాశాలల్లో పోలింగ్ అధికారులకు గురువారం నిర్వహించిన శిక్షణ తరగతులను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఎన్నికల ప్రక్రియకు 15 వేల మంది సిబ్బంది.. పరిశీలన నిమిత్తం వెయ్యి మంది మైక్రో అబ్జర్వర్లను నియమించామని వెల్లడించారు. రెండు విడతల్లో ఐదు వేల మందికి శిక్షణ ఇవ్వనున్నామని తెలిపారు. నియోజకవర్గాలకు సంబంధించిన పోలింగ్.. సహాయ పోలింగ్ అధికారులకు మాస్టర్ ట్రెయినర్ల ద్వారా శిక్షణ ఇస్తున్నామన్నారు. కమిషనర్ వికాస్ మర్మత్, ఆర్డీఓ మలోల తదితరులు పాల్గొన్నారు.

బీఈడీ కళాశాలలో రేపట్నుంచి స్పాట్ అడ్మిషన్లు

నెల్లూరు(టౌన్): నగరంలోని ప్రభుత్వ బీఈడీ కళాశాలలో మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్లను శనివారం నుంచి మంగళవారం వరకు నిర్వహించనున్నామని ప్రిన్సిపల్ వేణుగోపాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీఎడ్ సెట్‌లో అర్హత సాధించి, 2023 – 24 సంవత్సరంలో ఎక్కడా ప్రవేశం పొందని వారు అడ్మిషన్లను పొందవచ్చని చెప్పారు. ఆసక్తి గల వారు రిజిస్ట్రేషన్, కళాశాల ఫీజు, ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని, వివరాలకు 73308 20897, 90326 04255 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

లక్ష్మీనరసింహుడికి విశేష పూజలు



నెల్లూరు సిటీ: శ్రీవారి జన్మనక్షత్రం స్వాతిని పురస్కరించుకొని నెల్లూరు రూరల్ మండలం నరసింహకొండపై కొలువైన వేదగిరి లక్ష్మీనరసింహస్వామికి విశేష పూజలను గురువారం నిర్వహించారు. శ్రీవారికి పంచామృతాభిషేకం, తిరుప్పావై సేవను ఆలయ ప్రధానార్చకుడు భాస్కరాచార్యులు ఆధ్వర్యంలో జరిపారు. శ్రీవారు విశేషాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈఓ గిరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కిలో పొగాకు గరిష్ట ధర రూ.231

కలిగిరి: కలిగిరిలోని పొగాకు వేలం కేంద్రంలో కిలో పొగాకుకు గరిష్ట ధర రూ.231 గురువారం లభించింది. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 719 పొగాకు బేళ్లను విక్రయానికి తీసుకురాగా, 593 బేళ్లను కొనుగోలు చేశారు. 126 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. ఈ సందర్భంగా వేలం నిర్వహణాధికారి మహేష్ కుమార్ మాట్లాడారు. కనిష్ట ధర రూ.220.. సరాసరి కిలో పొగాకుకు రూ.227.85 లభించిందని తెలిపారు. వేలంలో 13 కంపెనీలు పాల్గొన్నాయన్నారు.


పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

నెల్లూరు(టౌన్) : పాలిసెట్ ప్రవేశ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఏప్రిల్ ఒకటి నుంచి ఉచితంగా శిక్షణతో పాటు స్టడీ మెటీరియల్‌ను అందజేయనున్నామని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ విజయ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరు ప్రభుత్వ మహిళా, వెంకటేశ్వరపురం, కావలి, ఆత్మకూరులోని పాలిటెక్నిక్ కళాశాలల్లో శిక్షణ ఇవ్వనున్నామని చెప్పారు. వివరాలకు 82477 89541, 8187 00345 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఎన్నికలకు ముందే షాకులు

తీవ్ర అంతర్మథనంలో వేమిరెడ్డి

- వెంటాడుతున్న ఓటమి భయం
- ప్రచారాల్లో స్వపక్షం నుంచే నిరసనలు
- ఆత్మీయ సభల్లోనూ అవమానాలు
- ఖర్చుల పేరుతో పీక్కుతింటున్న నేతలు



వెంటాడుతున్న ఓటమి భయం.. స్వపక్షం నుంచే ఎదురవుతున్న నిరసనలు.. ఖర్చు పేరిట పీల్చిపిప్పి చేస్తున్న నేతలు.. ఇలా వరుస షాకులతో టీడీపీ నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి ఎన్నికలకు ముందే చుక్కలు కనిపిస్తున్నాయి. ప్రత్యక్ష రాజకీయాలతో ఏ మాత్రం సంబంధంలేని ఆయన ఈ పరిణామాలను జీర్ణించుకోలేకపోతున్నారు. ఆత్మీయ సమావేశాల పేరిట డబ్బులిచ్చి జనాలను తరలిస్తున్నా, అభ్యర్థులు మాట్లాడే సమయానికి వీరు నిష్క్రమిస్తుండటంతో పుండుమీద కారం జల్లిన పరిస్థితి వేమిరెడ్డికి ఏర్పడింది.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: టీడీపీ నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి రాజకీయ పరిస్థితి ఓ అడుగు ముందుకు.. నాలుగడుగులు వెనక్కి అనే రీతిలో సాగుతోంది. ప్రచారానికి వెళ్తున్న వేమిరెడ్డి దంపతులకు స్వపక్ష నేతల నుంచే అవమానాలు, నిరసనలు స్వాగతం పలుకుతున్నాయి. జిల్లాలో టీడీపీ గ్రాఫ్ మెరుగుపడకపోవడం.. పైగా ఆ పార్టీ అధికారంలోకి వచ్చే అవకాశాల్లేవనే సంకేతాల తరుణంలో కీలక నేతలుగా ప్రచారం చేసుకుంటూ అందిన కాడికి గుంజాలనే ఉద్దేశంతో కొందరు ఆయన చుట్టూ కోటరీగా ఏర్పడ్డారు.

వలసలను ప్రోత్సహిస్తున్నా పెరగని ప్రజాదరణ

భారీ ప్యాకేజీలతో టీడీపీలోకి వలసలను ప్రోత్సహిస్తున్నా, క్షేత్రస్థాయిలో ఆ పార్టీకి ప్రజాదరణ ఏ మాత్రం పెరగడంలేదు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కట్టబెట్టిన అత్యుత్తమ పదవులతో పాటు గౌరవ మర్యాదలు పొందిన వీరి పరిస్థితి ప్రస్తుతం ఒక్కసారిగా తిరగబడింది. వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పట్టుబట్టి టీడీపీ కోవూరు అభ్యర్థిగా తన భార్య వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పేరును ఖరారు చేయించారు. వాస్తవానికి ఏళ్ల పాటు కష్టించి తానే అభ్యర్థినని విస్తృత ప్రచారం చేసిన పోలంరెడ్డి దినేష్‌రెడ్డికి ఈ పరిస్థితి మింగుడుపడలేదు. తనను పక్కనబెట్టడాన్ని జీర్ణించుకోలేని దినేష్ తనదైన శైలిలో రాజకీయాలకు తెరలేపారు.

వెన్నంటే ఉంటూ నిరసనలకు సై..

వేమిరెడ్డి వెన్నంటే దినేష్‌రెడ్డి ఉంటూ తెరచాటు రాజకీయాలు చేస్తున్నారనే ప్రచారమూ జరుగుతోంది. అధిష్టాన ఆదేశాలతో పార్టీ కోసం పనిచేస్తూ.. ప్రశాంతక్కను గెలిపించుకుందామంటూ మండలాల వారీగా ఆత్మీయ సమావేశాలను నిర్వహిస్తున్న దినేష్.. పరోక్షంగా వారికి నిరసన సెగ చూపేలా కేడర్‌ను సమాయత్తపరుస్తున్నారని సమాచారం. ఇందుకూరుపేట మండలానికి ఆదివారం ఆమె వెళ్లగా, టీడీపీ వర్గీయులు భారీగా గుమిగూడి గో బ్యాక్.. ప్రశాంతి.. డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. కొద్దిసేపు నిరీక్షించినా పరిస్థితి సద్దుమణగకపోవడంతో ఆమె వెనుదిరిగారు. ఇదే సమయంలో దినేష్‌రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినదించడం.. అనంతరం తన వర్గంతో కలిసి వెళ్లి ఆత్మీయ సమావేశాన్ని ఆయన నిర్వహించడాన్ని దీనికి ఉదాహరణగా చూపుతున్నారు. ఆత్మీయ సమావేశాల్లో వరుసగా చోటుచేసుకుంటున్న ఘటనలతో ప్రశాంతిరెడ్డికి వెన్నుపోటు తప్పదనే అభిప్రాయం రాజకీయ విశ్లేషకుల్లో వ్యక్తమవుతోంది.

ఆగండయ్యా..!

కోవూరులోని నెల్లూరు గ్రాండ్ హోటల్, బుచ్చిరెడ్డిపాళెం టోల్‌ప్లాజా వద్ద వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశాలను నిర్వహించారు. ఇందులో ఆయన మాట్లాడుతుండగానే, సభ నుంచి వెళ్లేందుకు కేడర్ సన్నద్ధమయ్యారు. ఎక్కడికెళ్తున్నారు.. ఆగండి అని వేమిరెడ్డి వేడుకున్నా పట్టించుకోకుండా అందరూ బయల్దేరారు.

ఖర్చులంటూ ఒత్తిడి

నెల్లూరు పార్లమెంట్ పరిధిలో టీడీపీ నుంచి బరిలోకి దిగుతున్న అభ్యర్థులు తమ ఎన్నికల ఖర్చుల కోసం వేమిరెడ్డిపై ఒత్తిడి తెస్తున్నారని సమాచారం. వేమిరెడ్డి నివాసంలో నాలుగు రోజుల క్రితం నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు వారు డిమాండ్ చేశారని తెలిసింది. ఇంకా నామినేషన్ల పర్వమే ప్రారంభం కాలేదు.. అప్పుడే డబ్బులేంటి.. తర్వాత చూద్దామని ఆయన చెప్పారని సమాచారం.

నిబంధనల మేరకే పింఛన్ల పంపిణీ

- మూడు నుంచి అందజేత
- డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి



నెల్లూరు(పొగతోట): వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ ప్రక్రియను ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు నిర్వహించాలని డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి ఆదేశించారు. నగరంలోని డీఆర్డీఏ కార్యాలయం నుంచి మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలతో గురువారం నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. వైఎస్సార్ పింఛన్ కానుకను ఏప్రిల్ మూడు నుంచి ఎనిమిది వరకు పంపిణీ చేయనున్నామని, ఈ మేరకు ఎన్నికల కమిషన్ ఆదేశాలిచ్చిందని చెప్పారు. లబ్ధిదారులకు నగదును వలంటీర్లు పంపిణీ చేసే సమయంలో రాజకీయ నేతలు, ప్రజాప్రతినిధులు ఉండటానికి వీల్లేదని తెలిపారు. ఎలాంటి ప్రచారానికి అనుమతి లేదని.. ఫొటోలు, వీడియోలు తీయడం నిషేధమన్నారు.

నేడూ విద్యుత్ బిల్లులు చెల్లించొచ్చు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): గుడ్ ఫ్రైడే సందర్భంగా శుక్రవారం సెలవైనా విద్యుత్ బిల్లుల కేంద్రాలు యథావిధిగా పనిచేయనున్నాయని ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్‌ఈ విజయన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని విద్యుత్ బిల్లులను చెల్లించాలని కోరారు.

కోటంరెడ్డి అరాచకాలకు త్వరలో స్వస్తి



మాట్లాడుతున్న విజయసాయిరెడ్డి, పక్కన ఆదాల ప్రభాకర్‌రెడ్డి



రోడ్‌షోలో ఫ్యాన్‌ను చూపుతూ..

- వెన్నుపోటుదారులకు ప్రజలే బుద్ధి చెప్పాలి
- వైఎస్సార్‌సీపీ నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి విజయసాయిరెడ్డి

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అరాచకాలు అడ్డూఅదుపు లేకుండా సాగాయని, ఆయన బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు త్వరలోనే స్వస్తి పలుకుతామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గంలోని 23వ డివిజన్లో పార్టీ నెల్లూరు రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డితో కలిసి రోడ్‌షోను గురువారం ఆయన నిర్వహించారు. పడారుపల్లి, దివ్యాంగుల కాలనీ, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ ప్రాంతం, కావేరి జంక్షన్ బస్టాప్, సుందరయ్య కాలనీ, ప్రభుత్వాస్పత్రి ఏరియా, చలపతినగర్, ఆటోనగర్ ప్రాంతాల మీదుగా రోడ్‌షో సాగింది. అడుగడుగునా వీరికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి మాట్లాడారు. ఏడాదిలో ఈ డివిజన్లో రోడ్లు, డ్రెయిన్లు, పార్కులను రూ.8.26 కోట్లతో ఆదాల అభివృద్ధి చేశారని చెప్పారు. ఈ ప్రాంతంలో కొన్ని అభివృద్ధి పనులను తాము గుర్తించామని.. రూ.1.8 కోట్లతో పడారుపల్లి చెరువు పునరుద్ధరణ తదితరాలను చేపడతామని వెల్లడించారు. ఆదాల ప్రభాకర్‌రెడ్డి, తాను ఈ ప్రాంత ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని చెప్పారు.

టీడీపీకి అభ్యర్థులేరీ..?

పోటీ చేసేందుకు అభ్యర్థులు దొరక్క.. తమ పార్టీ నుంచి ఫిరాయించిన వారికి టికెట్లను టీడీపీ కేటాయించిందని, ఆ పార్టీ పరిస్థితికి ఇది అద్దం పడుతోందని విమర్శించారు. డబ్బుంటే ఎన్నికల్లో గెలవొచ్చనే దురుద్దేశంతో వెన్నుపోటుదారులను టీడీపీ ప్రోత్సహిస్తోందని ధ్వజమెత్తారు. వీరికి ప్రజలు తగిన బుద్ధి చెప్తారన్నారు. స్వార్థపూరిత ధోరణితో తమ పార్టీకి వేమిరెడ్డి వెన్నుపోటు పొడిచి.. టీడీపీ పంచన చేరారని తెలిపారు. ఇలాంటి వ్యక్తి నెల్లూరు పార్లమెంట్ స్థానంలో.. ఆయన సతీమణి కోవూరు నుంచి పోటీ చేయడం ఎంత వరకు సబబో ప్రజలు ఆలోచించాలని కోరారు. 2014, 2019లో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి తమ పార్టీ టికెట్ ఇచ్చి ఎమ్మెల్యేగా అవకాశం కల్పించిందని.. ఆదరించిన పార్టీని, నమ్మిన ప్రజలను మోసం చేసి పార్టీ ఫిరాయించి పసుపు కండువా కప్పుకొన్నారని ఆరోపించారు. నియోజకవర్గానికి ఆయన చేసిందేమీలేదని, నెల్లూరులో బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు శ్రీకారం చుట్టారని మండిపడ్డారు. భూములను ఆక్రమించుకునేందుకే తాను ఇక్కడికి వచ్చానంటూ తప్పుడు ఆరోపణలను కోటంరెడ్డి చేశారని, ఆయన ఆక్రమించుకున్న భూములను తిరిగి ప్రభుత్వానికే అప్పగిస్తామని స్పష్టం చేశారు. నెల్లూరులో భూములనే ఆయన మిగల్చలేదని ధ్వజమెత్తారు. స్వార్థం, బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు కోటంరెడ్డి నిదర్శనమని.. సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పనిచేయడం ఆదాల ప్రభాకర్‌రెడ్డి నైజమని తెలిపారు.

నా జీవితం వైఎస్సార్ కుటుంబానికే అంకితం

ప్రాణం ఉన్నంత వరకు జగన్‌మోహన్‌రెడ్డితోనే ఉంటానని, తన జీవితం వారి కుటుంబానికే అంకితమని విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. నెల్లూరు ఎంపీగా తనను, రూరల్ నుంచి ఆదాలను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. తాను మాట తప్పిన సందర్భాల్లేవని తెలిపారు. ఎమ్మెల్సీ, పార్టీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, మేయర్ స్రవంతి, పార్టీ నగరాధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి, మలిరెడ్డి కోటారెడ్డి, ఎస్సీ విభాగ అధ్యక్షుడు జూపూడి ప్రభాకర్, కార్పొరేటర్ దుద్దుగుంట శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తన్నుకున్న తమ్ముళ్లు

- కావ్య సమక్షంలో ముష్టిఘాతాలు



కావలి: ఎన్నికలు సమీపించే కొద్దీ టీడీపీ నేతల మధ్య తన్నులాటలు ఆ పార్టీ అధిష్టానాన్ని కలవరపెడుతున్నాయి. తాజాగా కావలిలో టీడీపీ అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి సమక్షంలోనే నేతలు ఘర్షణ పడిన ఘటన పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. అల్లూరులో కావ్య సమక్షంలోనే పార్టీ కార్యాలయ తలుపులను విరగ్గొట్టిన ఘటన మర్చిపోకముందే.. ఆయన వేదికగా పట్టణంలోని ఎనిమిదో వార్డుకు చెందిన నేతలు బుధవారం రాత్రి ముష్టిఘాతాలకు దిగారు. వివరాలు.. పట్టణంలోని ఎనిమిదో వార్డులో టీడీపీ నేతలు రహీం, ఖమర్ మధ్య కొంతకాలంగా ఆధిపత్య పోరు నడుస్తోంది. ఈ క్రమంలో పట్టణంలోని కావ్య నివాసంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కార్యాలయంలో వీరు బుధవారం సాయంత్రం సమావేశమయ్యారు. ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగి.. ఒకరిపై ఒకరు దాడులు చేసుకునే స్థితికి చేరుకుంది. నిలువరించడంలో కావ్య విఫలమవడంతో గొడవ పెద్దదిగా మారింది. ఖమర్ గాయపడటంతో ఆయన వర్గీయుల ఆవేశంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. రహీంపై పోలీస్ కేసు పెట్టాలని ఖమర్ వర్గీయులు యత్నించారు. చంద్రబాబు పర్యటనకు ముందు కేసులొద్దని.. పూర్తయ్యాక చూసుకుందామని సర్దిచెప్పి ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించారు.

లారీలు ఢీకొని డ్రైవర్ల మృతి



వరికుంటపాడు: ఆగి ఉన్న లారీని వెనుక నుంచి మరో లారీ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు డ్రైవర్లు మృతి చెందిన ఘటన మండలంలోని తిమ్మారెడ్డిపల్లి వద్ద గురువారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. కర్ణాటకలోని దావణగెరె నుంచి రాగుల లోడుతో లారీ గుంటూరు వైపు బయల్దేరింది. తిమ్మారెడ్డిపల్లి సమీపంలోకి వచ్చేసరికి డ్రైవర్ బత్తల సుబ్బారాయుడు వాహనాన్ని రోడ్డు మార్జిన్‌లో నిలిపి టైర్లలో గాలిని చెక్ చేయసాగారు. ఇదే సమయంలో కమలాపురం నుంచి వస్తున్న మినీ ఐషర్ వాహనం లారీ వెనుక భాగాన్ని వేగంగా ఢీకొంది. ఘటనలో సుబ్బారాయుడు (60), మినీ వాహన డ్రైవర్ రసపుత్ర ప్రతాప్‌సింగ్ (44) అక్కడికక్కడే మృతి చెందారు. మినీ వాహనం ముందు భాగం నుజ్జునుజ్జయింది. ఉదయగిరి సీఐ గిరిబాబు, వరికుంటపాడు ఎస్సై తిరుపతయ్య, సిబ్బంది ఘటన స్థలానికి చేరుకున్నారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాలను ఉదయగిరి ఆస్పత్రికి తరలించారు. సుబ్బరాయుడు వైఎస్సార్ జిల్లా అలగానిపల్లి.. రసపుత్ర ప్రతాప్‌సింగ్ అన్నమయ్య జిల్లా మదనపల్లికి చెందిన వారిగా గుర్తించారు.

పెళ్లింట అంతులేని విషాదం

- రోడ్డు ప్రమాదంలో మృతులు కందుకూరు వాసులు
- వివాహానికి హాజరై తిరిగొస్తుండగా ప్రమాదం
- పెళ్లి కూతురి తల్లి, అన్న, బంధువు మృతి
- మరో ముగ్గురికి తీవ్ర గాయాలు



శ్రావణి (ఫైల్)



కడసారి చూసేందుకు వచ్చిన బంధువులు

కందుకూరు: రోడ్డు ప్రమాదం పెళ్లింట అంతులేని విషాదాన్ని నింపింది. వివరాలు.. కందుకూరు పట్టణంలోని విప్పగుంటలో నివాసముంటున్న రాయని అరుణ (50), రమణయ్య భార్యాభర్తలు. రమణయ్య సుమారు 20 ఏళ్ల క్రితం భార్యతో విభేదించి వెళ్లిపోయారు. అప్పటి నుంచి ఆమె కోవూరు రోడ్డులో టిఫిన్ దుకాణాన్ని నిర్వహించుకుంటూ తన ఇద్దరి పిల్లలను పెంచి పెద్ద చేశారు. ఈ క్రమంలో కుమార్తె స్రవంతికి తెలంగాణలోని ఖమ్మం జిల్లా పాల్వంచకు చెందిన అశేష్ అనే యువకుడితో వివాహం నిశ్చయమైంది. పాల్వంచలోని వరుడి ఇంట్లో బుధవారం రాత్రి ఘనంగా పెళ్లి జరిగింది. అర్ధరాత్రి రెండు గంటల ప్రాంతంలో అరుణతో పాటు కుమారుడు వేణుగోపాల్, మేనల్లుడు వినోద్, అతని భార్య తల్లపనేని దివ్య (30), వారి కుమారుడు మణి, మరో బంధువు గుళ్లాపల్లి శ్రావణి (22) కలిసి కారులో కందుకూరు బయల్దేరారు. వాహనాన్ని వేణుగోపాల్ నడిపారు. ఈ క్రమంలో గురువారం ఉదయం ఆరు గంటల ప్రాంతంలో సూరారెడ్డిపాళెం వద్ద కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని పల్టీలు కొట్టింది. ప్రమాదంలో అరుణ, దివ్య, శ్రావణి అక్కడికక్కడే మృతి చెందగా.. వేణుగోపాల్, వినోద్, మణి తీవ్రంగా గాయపడ్డారు. ఒంగోలులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వీరు చికిత్స పొందుతున్నారు.

అంతలోనే..

అప్పటి వరకు పెళ్లిలో ఆనందంగా గడిపిన వారు అంతలోనే రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం తీవ్ర విషాదాన్ని నింపింది. తల్లి, బంధువులు రోడ్డు ప్రమాదంలో మరణించారనే వార్త తెలిసి కొత్త పెళ్లి కూతురు స్రవంతి కన్నీరుమున్నీరయ్యారు. దివ్య భర్త వినోద్ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. ఆమె భర్త, తన ఐదేళ్ల కుమారుడు మణితో కలిసి అక్కడే నివాసం ఉంటున్నారు. మేనత్త కుమార్తె వివాహం కావడంతో వినోద్ కుటుంబంతో కలిసి రెండు రోజుల క్రితమే కందుకూరొచ్చారు. అయితే ఊహించని ప్రమాదంలో దివ్య మృతి చెందారు.

ఉద్యోగ ప్రయత్నంలో ఉండగా..

పెళ్లి కోసమే హైదరాబాద్ నుంచి వచ్చిన శ్రావణి మృతి చెందడం తల్లిదండ్రులు వెంకటేశ్వర్లు, ఆదిలక్ష్మికి మింగుడు పడని ఘటనగా మారింది. శ్రావణి కుటుంబం చాలా కాలంగా హైదరాబాద్‌లో ఉంటోంది. డిగ్రీ పూర్తి చేసిన ఆమె ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నారు. స్రవంతి పెళ్లి కోసమని శ్రావణి కందుకూరు వచ్చారు. ఇక స్రవంతి సొంత అన్న వేణుగోపాల్ కొద్దిరోజులుగా పెళ్లి పనులతో తీరిక లేకుండా గడుపుతున్నారు. విశ్రాంతి తీసుకోకుండా అర్ధరాత్రి కారు డ్రైవింగ్ చేస్తూ రావడం.. నిద్రమత్తు కారణంగా ప్రమాదం జరిగి ఉంటుందని బంధువులు చెబుతున్నారు. అటు తల్లిని కోల్పోయి, ఇటు అన్న హాస్పిటల్ పాలవడంతో స్రవంతి రోదన వర్ణనాతీతంగా ఉంది. మృతదేహాలను గుర్రవారంపాళెం సమీపంలోని శ్మశానంలో ఖననం చేశారు. అక్కడికి పెద్ద ఎత్తున బంధువులు చేరుకున్నారు.

ఓటు ఆవశ్యకతపై అవగాహన



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని పోలినాయుడుచెరువు గ్రామంలో స్వీప్ ఆధ్వర్యంలో ఓటుహక్కు ఆవశ్యకతపై ప్రజలకు గురువారం అవగాహన కల్పించారు. ప్రలోభాలకు గురికాకుండా నచ్చిన అభ్యర్థిని ఎన్నుకోవాలని సూచించారు. నగదు తీసుకొని ఓటేస్తే ప్రశ్నించేతత్వాన్ని కోల్పోతారని వివరించారు. తద్వారా అభివృద్ధి పనులు జరగవన్నారు. ఎన్నికలను ప్రశాంత వాతారణంలో నిర్వహించేందుకు ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని పేర్కొన్నారు. స్వీప్ నోడల్ ఆఫీసర్ రత్నం, రవిశంకర్‌రెడ్డి, మల్లేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాన్నకు మద్దతుగా..

నెల్లూరుసిటీ/పొదలకూరు/బుచ్చిరెడ్డిపాళెం రూరల్: రాజకీయ పార్టీలు నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారం ముమ్మరంగా చేస్తున్నాయి. అభ్యర్థులే కాకుండా వారి కుటుంబసభ్యులు ఇందులో పాలుపంచుకుంటున్నా రు. సర్వేపల్లిలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డిని గెలిపించాలంటూ ఆయన కుమార్తె పూజితారెడ్డి కొద్దిరోజులుగా ప్రచారం చేస్తున్నారు. నేతలతో కలిసి పొదలకూరు మండలంలో ప్రతి ఇంటికీ వెళ్లి ఓట్లు వేయాలని కోరుతున్నారు. ఇక నెల్లూరు రూరల్ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి విజయం కోసం ఆయన తనయ హిమబిందురెడ్డి గురువారం 41వ డివిజన్‌లో కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రజలతో మాట్లాడారు. కోవూరు అభ్యర్థి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కోసం ఆయన తనయుడు రజత్‌కుమార్‌రెడ్డి బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని పదో వార్డులో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని ఓటర్లను కోరారు.



కరపత్రం అందజేస్తున్న ఆదాల కుమార్తె హిమబిందురెడ్డి



ప్రచారం చేస్తున్న కాకాణి కుమార్తె పూజిత



బుచ్చి పదో వార్డులో ప్రచారంలో పాల్గొన్న నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి

క్లుప్తంగా

బంగారు గరుడ వాహనంపై నృసింహుడు



రాపూరు: ప్రసిద్ధ పెంచలకోన క్షేత్రంలో గురువారం పెనుశిల లక్ష్మీ నరసింహస్వామి బంగారు గరుడ వాహనంపై భక్తులను కటాక్షించారు. ఉదయం విశేష అభిషేక పూజలు చేసి చందనంతో అలంకరించారు. అనంతరం కల్యాణ మండపంలో శాంతి హోమం నిర్వహించారు. తదరుపరి కల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి సర్వాలంకార భూషితుడైన స్వామి బంగారు గరుడ వాహనంపై కొలువుదీరి తిరువీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు.

దివ్యాంగులకు చేయూత

- రూ.15 లక్షల విలువైన వీల్‌చైర్లు, ట్రైసైకిళ్ల పంపిణీ



వీల్‌చైర్లు అందుకున్న వారితో హామిల్టన్ పరిశ్రమ ప్రతినిధులు

శ్రీసిటీ (వరదయ్యపాళెం): శ్రీసిటీలోని గృహోపకరణాల తయారీ పరిశ్రమ హామిల్టన్ ప్రైవేట్ లిమిటెడ్ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్‌ఆర్)లో భాగంగా శ్రీసిటీ పరిసర ప్రాంతాల్లోని దివ్యాంగులకు చేయూతనందించింది. రూ.15 లక్షల విలువైన వీల్‌చైర్లు, ట్రైసైకిళ్లు, వినికిడి యంత్రాలు, ఊత కర్రలు, మరికొన్ని పరికరాలను వితరణగా అందజేశారు. గురువారం పరిశ్రమ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హామిల్టన్ పరిశ్రమ జనరల్ మేనేజర్ జయంత, ఇతర ప్రతినిధులు రాజేష్ గాంధీ, ప్రసన్న, డానేలివాజ్, లారెన్స్, శ్రీసిటీ ప్రతినిధులు రమేష్ కుమార్, వై.రమేష్, సురేంద్ర కుమార్‌ల చేతుల మీదుగా 305 మంది దివ్యాంగులకు వారివారి అవసరాలకు అనుగుణంగా పరికరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శ్రీసిటీ ఫౌండేషన్ సహకారం, సూచనల మేరకు ఇంతపెద్ద కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. భవిష్యత్‌లో ఈ తరహా కార్యక్రమాలు విరివిగా చేస్తామన్నారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన ప్రకటనలో హామిల్టన్ సీఎస్‌ఆర్ కార్యక్రమాన్ని అభినందించారు. దివ్యాంగులకు ఎంతో అవసరమైన పరికరాలను అందించే గొప్ప కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	:142
లేయర్ (లైవ్)	:73
బ్రాయిలర్ చికెన్	:250
బ్రాయిలర్ స్కిన్‌లెస్	:278
లేయర్ చికెన్	:125



ఉదయగిరి సమగ్రాభివృద్ధే ధ్యేయం



మాట్లాడుతున్న విజయసాయిరెడ్డి, చిత్రంలో రాజగోపాల్‌రెడ్డి, నాయకులు

సీతారామపురం(ఉదయగిరి): సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆశీస్సులతో ఉదయగిరి నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి.. తాగు, సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపి.. ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని వైఎస్సార్‌సీపీ నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. సీతారామపురంలో పార్టీ ఉదయగిరి నియోజకవర్గ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డితో కలిసి గురువారం నిర్వహించిన రోడ్‌షోలో విజయసాయిరెడ్డి మాట్లాడారు. సోమశిల ప్రాజెక్ట్ పనులను త్వరలోనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. వెలుగొండ ప్రాజెక్ట్ పనులు పూర్తయిన తరుణంలో వచ్చే సీజన్ నాటికి ఈ ప్రాంతానికి సాగునీరందుతుందని చెప్పారు. నియోజకవర్గంలోని సీతారామపురం, ఉదయగిరి, దుత్తలూరు, మర్రిపాడు మండలాల్లోని అన్ని చెరువులను సోమశిల, వెలుగొండ ప్రాజెక్టుల జలాలతో నింపుతామని చెప్పారు.

పార్టీకి జిల్లా కంచుకోట

పార్టీకి జిల్లా కంచుకోట అని, రానున్న ఎన్నికల్లోనూ అదే ఆదరాభిమానాలను చూపాలని కోరారు. రాజ్యసభ సభ్యుడిగా ఆరేళ్ల పాటు పదవిని అనుభవించి పార్టీకి వెన్నుపోటు పొడిచి వెళ్లిన వారికి తగిన బుద్ధి చెప్పాలంటూ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. చంద్రబాబు 14 ఏళ్ల పాలనలో రాష్ట్రం అతలాకుతలమైందని చెప్పారు. రాష్ట్రాన్ని దోచుకునేందుకు టీడీపీ, కాంగ్రెస్, జనసేన, బీజేపీ యత్నిస్తున్నాయని ఆరోపించారు. ప్రజల పక్షాన నిలబడే ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు.

జగన్ మరోసారి సీఎం కావడం తథ్యం

రానున్న ఎన్నికల్లో పార్టీ ఘన విజయం సాధించి జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం కావడం తథ్యమని రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధి మేకపాటి కుటుంబంతోనే సాధ్యమన్నారు. ఈ ఎన్నికల అనంతరం టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్ అమెరికా వెళ్లిపోవడం ఖాయమని తెలిపారు. ఎల్వీఆర్ కళాశాల నుంచి బస్టాండ్ వరకు జరిగిన ర్యాలీకి భారీ సంఖ్యలో ప్రజలు మండుటెండను సైతం లెక్కచేయకుండా హాజరయ్యారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చెరుకుపల్లి రమణారెడ్డి, ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి, పార్టీ మండలాధ్యక్షుడు చింతంరెడ్డి సుబ్బారెడ్డి, మాజీ జెడ్పీటీసీ దుగ్గిరెడ్డి గురవారెడ్డి, అల్లూరు రాజు తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయండి



బాలాయపల్లి నేతలతో రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు శ్రమించాలని ఆ పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి సూచించారు. ఆయనను గురువారం బాలాయపల్లి మండలానికి చెందిన సీనియర్ నాయకుడు, మాజీ ఏఎంసీ చైర్మన్ వెందోటి మధుసూదన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు వెందోటి కార్తీక్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. నేదురుమల్లి మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో మేనిఫెస్టోలో చెప్పిన అంశాలను నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని తెలిపారు. పేదల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేశారని గుర్తు చేశారు. జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని కోరారు.

నా బిడ్డను ఆశీర్వదించండి

తన బిడ్డ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ప్రజలకు సేవ చేయాలని ముందుకొచ్చాడని, ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపించాలని మాజీ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి కోరారు. ఆమె గురువారం వెంకటగిరి రూరల్ మండలం జీకేపల్లి, కశవలపూడి, కుమ్మరిపేట, కె.ఉప్పరపల్లిలో పర్యటించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం నుంచి వారు పొందిన పథకాలు, లబ్ధిని వివరించారు. ఆమె మాట్లాడుతూ తమను ఆదరించినట్టే తన బిడ్డనూ ఆశీర్వదించాలని కోరారు. అనంతరం ఆమె మొరవనేని అంజమ్మ, వడపల్లి సుబ్బరామయ్య, రాజేంద్ర, బత్తయ్య, చంద్రయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని, ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు కాల్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఎం.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అనుమానంతోనే వివాహిత హత్య

- భర్తను అరెస్ట్ చేసిన పోలీసులు



మాట్లాడుతున్న సీఐ నఫీజ్‌బాషా, పక్కన ఎస్సై ఆనంద్ భాస్కర్

కందుకూరు: దారుణ హత్యకు గురైన వివాహిత వనజాక్షి (27) కేసులో భర్తే నిందితుడని పోలీసులు నిర్ధారించారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ నఫీజ్ బాషా కేసు వివరాలను వెల్లడించారు. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం, గట్లపాడు గ్రామానికి చెందిన నంబాల యర్రమ్మ, నాగేశ్వరరావు తమ కుమార్తె అయిన వనజాక్షిని వలేటివారిపాళెం మండలం పోకూరు గ్రామానికి చెందిన చిమటా శివకృష్ణ (36)కు ఇచ్చి 2014లో వివాహం చేశారు. వారికి ఇద్దరు కుమార్తెలున్నారు. పట్టణంలోని గాయత్రి నగర్‌లో నివాసం ఉంటున్నారు. శివకృష్ణ ట్రాక్టర్ నడుపుతుంటాడు. వనజాక్షి ఇంట్లోనే బ్యూటీపార్లర్ నిర్వహిస్తోంది. ఈనెల 25వ తేదీన వనజాక్షి ఇంట్లో హత్యకు గురైంది. కొంతకాలంగా భార్య ప్రవర్తనపై శివకృష్ణ అనుమానం పెంచుకున్నాడు. దీంతో ఇద్దరి మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. గతంలో ఒకసారి పోలీస్‌స్టేషన్ వరకూ వెళ్లి కౌన్సెలింగ్ తీసుకున్నారు. అయినా విభేదాలు తగ్గలేదు. 25వ తేదీ మధ్యాహ్నం భార్యాభర్తల మధ్య ఘర్షణ జరిగింది. ఆవేశంతో శివకృష్ణ ట్రాక్టర్ డోర్‌కు పెట్టే ఇనుపరాడ్‌తో భార్య తలపై బలంగా కొట్టాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. నిందితుడు పరారయ్యాడు. సాయంత్రం 6 గంటల ప్రాంతంలో తల్లిదండ్రులు వనజాక్షికి ఎన్నిసార్లు ఫోన్ చేసినా తీయకపోవడంతో ఇంటి కొచ్చి చూశారు. కుమార్తె చనిపోయి ఉండడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. శివకృష్ణను గురువారం అరెస్టు చేశారు. రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరచనున్నట్లు పోలీసులు తెలిపారు. సమావేశంలో ఎస్సై ఆనంద్ భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

నేత్రపర్వంగా విగ్రహ ప్రతిష్ట



నూతనంగా నిర్మించిన ఆలయం

సైదాపురం: మండలంలోని జోగిపల్లిలో నిర్మించిన కామాక్షిదేవి సమేత సిద్ధేశ్వరస్వామి ఆలయంలో స్వామి, అమ్మవారి విగ్రహ ప్రతిష్ట, మహాకుంభాభిషేకాన్ని గురువారం నేత్ర పర్వంగా నిర్వహించారు. ఆలయాన్ని పూలతో సుందరంగా అలంకరించారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఒగ్గు కృష్ణయ్య, ఆదూరు శ్రీనివాసులు, పల్లాపు రామకృష్ణ, కోలా భాస్కర్, రాంబాబు పాల్గొన్నారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.77
సన్నవి	: రూ.68
పండ్లు	: రూ.25

వెళ్లొస్తా నేస్తమా

విదేశీ వలస విహంగాలు వెళ్లిపోతున్నాయి. సీజన్ ముగియడంతో దాదాపు పదిరోజుల నుంచి తిరుగుముఖం పట్టాయి. ప్రస్తుతం నేలపట్టు పక్షుల సంరక్షణ కేంద్రంలో కొన్ని రకాల పక్షులు మాత్రమే విడిది చేస్తున్నాయి. ఎండ తీవ్రతతోపాటు కేంద్రంలో పక్షులు కూడా లేకపోవడంతో సందర్శకులు, పక్షి ప్రేమికుల సంఖ్య బాగా తగ్గిపోయింది.



గూడబాతు విహారం



పక్షుల కేంద్రంలోని చెరువులో అడుగంటిన నీరు



చెరువు గట్టున పక్షులు

- వెనుదిరిగిన విదేశీ వలస విహంగాలు
- పర్యాటకులను ఏడు నెలలుపాటు అలరించి..
- తగ్గిపోయిన సందర్శకుల రాక

దొరవారిసత్రం: ఆసియా ఖండంలోనే విదేశీ వలస విహంగాలకు మండలంలోని నేలపట్టు పక్షుల కేంద్రం సంతానోత్పత్తి కేంద్రంగా బాసిల్లుతోంది. సుమారు 16 రకాల వలస విహంగాలు వేల సంఖ్యలో ప్రతి సంవత్సరం అక్టోబర్‌లో విచ్చేసి ఏప్రిల్లోపు వాటి సంతానాన్ని రెండింతలు చేసుకుని వెళ్లిపోయడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో ఈ సీజన్‌లో గూడబాతులు, నత్తగుల్లకొంగలు, నీటికాకులు, స్వాతికొంగలు, తెడ్డుముక్కు కొంగలు తదితరాలు మూడు వేలకు పైగా వచ్చి విడిది చేసినట్లు స్థానిక వన్య ప్రాణి అధికారుల లెక్కలుగట్టారు. ప్రస్తుతం ఎండ తీవ్రత ఎక్కువ కావడంతోపాటు కేంద్రం పరిధిలో ఉన్న నేరేడు, మారేడు, అత్తిగుంట చెరువుల్లో నీళ్లు అడుగంటాయి. దీని కారణంగా విహంగాలకు వాతావరణం అనుకూలించకపోవడంతో సీజన్ పూర్తికాక ముందే ఆయా దేశాలకు వెనుదిరిగాయి. పది రోజుల నుంచే వెళ్లిపోతున్నట్లు అధికారులు చెబుతున్నారు. వయసు మీదపడి ఎగరలేని గూడబాతులు, మరికొన్ని గూడబాతుల పిల్లలు చెరువుల్లో అడుగంటిన నీటిలో ఈతాడుతూ దర్శనమిస్తున్నాయి. అదేవిధంగా నీటికాకులు, చిన్నస్వాతికొంగలు, శబరి కొంగలు కొన్ని బస చేస్తున్నాయి. ఈ సీజన్‌లో విదేశీ విహంగాలు అన్నీ రెండువేల పిల్లలను అభివృద్ధి చేసుకుని వెళ్లినట్లు స్థానిక వన్యప్రాణి విభాగం అధికారుల అంచనా.

గుడ్ ఫ్రైడే



క్రీస్తు విధేయతా బలియాగం

క్రీస్తు మరణ, సమాధి, పునరుత్థానాల వెనుక దేవుని దివ్య సంకల్పం ఉంది. దీన్నే సువార్త అంటారు. సువార్త దేవుని సంకల్పంతో ఎప్పుడూ ముడిపడే ఉంటుంది. పూర్వపు దేవుని సంకల్పం చెప్పక దాన్ని దాటవేసే సువార్త అసలు లెస్సయైన లేఖనానుసార సువార్తగా ఎప్పటికీ కానేరదు. సువార్త పుట్టుకకు ఆయువుపట్టు వంటి దేవుని ప్రణాళికను చాలా పకడ్బందీగా, పటిష్ఠంగా వివరించకున్ననూ అది సువార్త కాదు. సత్యవాక్యం అనే రక్షణ భాగ్యపు సువార్త ప్రకటన అపొస్తలుల బోధకు లోబడే ఉండి తీరాలి.

ఈ జగత్తుకు పునాది వేయక పూర్వమే దేవుని ఆలోచనలలో ఉన్న క్రీస్తు బలియాగం అనే 'పథక రచన' గూర్చి ఎంతగా చెప్పుకొన్నా, అది తక్కువే. తన ప్రజల పాప పరిహారార్థం అద్వితీయ జ్ఞానసంపన్నుడైన దేవుడు అనాదిలోనే క్రీస్తు పరిశుద్ధ రక్తానికి రూపకల్పన చేయడం జరిగింది. అప్పటికి ఇంకా మానవ సృష్టి జరగలేదు. భూలోకమే లేదు. భూమి మీద మనుష్యుల జాడే లేదు. పాపమే లేదు. దీన్నే క్రీస్తు కేంద్రంగా చేయబడిన దేవుని నిత్య సంకల్పంగా చెబుతారు. క్రీస్తు లేకుంటే దేవునికి సంకల్పమే లేదు అనేంత ఉన్నతం గా దీన్ని గూర్చి చెప్పుకోవడం మాత్రం అసాధారణం. తండ్రియైన యెహోవా దేవుడు తన నీతిని బట్టి సంతోషం గలవాడై ఘనపరచి గొప్ప చేసిన ఉపదేశ క్రమం సంబంధిత సంకల్పాన్ని మించిన భావజాలం లేదా భావ సంపద మరొకటి లేదంటారు.

దేవుని దృష్టి కోణంలో దేవుని మనస్సుతో దేవుని గ్రంథాన్ని లోతుగా అధ్యయనం చేసే వారికి ఒక విషయం తేటగా అర్థం అవుతుంది. అదేమిటంటే, దేవుడు అన్యాయం చేయుట అసంభవం అనునదే. ఈ సత్యాన్ని అనుభవ పూర్వకంగా తెలుసుకొన్నవారే ఆత్మ సంబంధులు. బలిని కాక కనికరమునే కోరే దేవుడు ప్రారంభంలో జంతుబలులను ఏర్పాటు చేసినా కూడా యుక్త కాలాన తన సొంత కుమారుడను బలిగా అర్పించుట ద్వారా ఇలా పాపవ్యాప్తి నివారణకు మేలైన శాశ్వత పరిష్కారం కనుగొని జంతు బలులకు చరమగీతం పలికాడు. యూదులకు చాలా సహజంగా సామాన్యంగా చెప్పే సత్యం ఒకటుంది. రక్తం చిందింపకుండా పాప క్షమాపణ కలుగదు. ఇది నమ్మే యూదులు మెస్సీయ బలిని కనులారా చూడటం ద్వారా విస్మయానికి గురయ్యారు. మహాదేవుని సంకల్పానికి బహు ముగ్ధులై ఐశ్వర్య భయంతో వినయ సంపన్నులైన వారంతా తలలు వంచి దేవుని పాదాల చెంత సాగిలపడ్డారు. మానవాళి అంతా పుట్టారు కాబట్టి చనిపోతారు. యేసుక్రీస్తు మరణించడానికే పుట్టాడంటూ పండిత పెద్దలు పదే పదే చెబుతుంటారు. ఇదే ఆయన జీవితం ప్రత్యేకత. ఇలాంటి జీవితం ఈ భూమి మీద ఏ ఒక్కరికీ లేదన్నదే సుసమాచారం. క్రీస్తు ఈ లోకానికి చెప్పశక్యం కాని ఒక వరంగాను ఆయన సాహసోపేత విధేయత తాలూకు ప్రాణత్యాగం మానవాళి పాలిట శుభవార్తగానూ చరిత్రకెక్కిందనేది గమనార్హం. బాల్యం నుండే కాక, మూడున్నర సంవత్సరాల తన యౌవన కాలమంతా దేవునికి వెచ్చించి విధేయుడైన వాడై తన్ను తాను దేవునికి అర్పణగా సమర్పించుకున్నాడు. 'నీ చిత్తమే సిద్ధించును గాక!' అంటూ మరణానికి ఎదురుగా వెళ్ళిన అరుదైన జీవితం క్రీస్తు ప్రభువుది.

లోక పాపాలను మోసుకొనిపోయే దేవుని గొఱ్ఱె పిల్లగా, పస్కా బలి పశువుగా క్రీస్తును అభివర్ణిస్తుంది పరిశుద్ధ బైబిలు. దేవునికి అవిధేయులైన మానవాళి పాపాలు గొఱ్ఱె పిల్లపై మోపబడ్డాయి. ఫలితంగా గొఱ్ఱెపిల్ల మరణించింది. క్రీస్తుకు ఇందుకొరకే శరీరం ఇవ్వబడింది లేదా అమర్చబడింది. దేవుని ప్రజల పాపాలకు ప్రతిగా వారి పక్షాన సిలువలో క్రీస్తు శరీరాన్ని శిక్షకు గురి చేయడం ద్వారా దేవుని ప్రజలు తమ తమ పాపాల నుండి విమోచించబడి పరిశుద్ధులయ్యారు. క్రీస్తు మరణం వెనుక దాగిన సువిశేష పరమార్థం ఇదే. మానవ ప్రారంభ ఆదాము అనే ఒకని అవిధేయత ద్వారా లోకంలోనికి పాపం ప్రవేశించింది. కడపటి ఆదాము అనే ఒకని విధేయత ద్వారా యావత్తూ అవిధేయ మానవాళికి రక్షణ భాగ్యం సంప్రాప్తించింది. వారంతా కొత్త జన్మతో నూతన సృష్టిగా పరివర్తన చెందారు. ఆ కడపటి ఆదామనే క్రీస్తు సాహసోపేత జీవిత విధానమే ఎల్లరకు పరిశుద్ధ జీవితాలను అనుగ్రహించింది.

ఈ దిగువ గల యెషయా భవిష్యత్ ప్రవచనం దాని వర్ణన అత్యున్నతమైన క్రీస్తు విధేయత జీవిత సారాన్ని అసాధారణ రీతిలో వెల్లడి చేయుట అనేది మనస్సు పెట్టి గమనించదగ్గది. బలి యాగంలో క్రీస్తు చూపిన విధేయత ఇప్పటికీ వేనోళ్ళ కొనియాడబడుతునే ఉండుట బహు ఆశ్చర్యకరం! ఈ ప్రవచనం క్రీస్తు నందు నెరవేరింది.

"అతడు దౌర్జన్యము నొందెను
బాధింపబడినను అతడు నోరు తెరువలేదు
వధకు తేబడు గొఱ్ఱె పిల్లయు
బొచ్చు కత్తిరించు వాని యెదుట గొఱ్ఱెయు
మౌనముగా నుండునట్లు
అతడు నోరు తెరువ లేదు
అన్యాయపు తీర్పు నొందిన వాడై
అతడు కొనిపోబడెను
అతడు నా జనుల యతిక్రమమును బట్టి
మొత్తబడెను గదా"

ఈ అరుదైన సృష్టిలో, బిడ్డను నవ మాసాలు మోసిన కన్న తల్లి అతన్ని భూమి మీద విడిచి పెట్టి కన్ను మూసింది. అతడు పెద్దవాడై తన తల్లి పట్ల నిత్యమూ కృతజ్ఞతాభావం కలిగిన వాడై ఆమె ఆలోచనలు, ఆశయాలు అన్వేషిస్తూ వాటి సాధనలో నిత్యమూ నిమగ్నమవడమే కాకుండా, తన తల్లి వలె ఏ ఒక్కరూ రక్త హీనతతో చనిపోకుండా పుష్టినిస్తూ బలవృద్ధి కలుగజేసే బహు మేలైన ఉచిత సేంద్రీయ సహజాహార పంపిణీకి దృఢ సంకల్పంతో నడుం కట్టాడు. తన తల్లి మరణాన్ని ఒక పండుగగా, వేడుకగా మలిచే పనిలో సత్క్రియల యందాసక్తితో అతడు సమాజంతో ప్రేమలో పడ్డాడు. 'ఆమె మరణించి మనకు దూరం కాలేదు. ఇదిగో ఇక్కడే ఉంది నవ్వుతూ అన్న భావనను కుటుంబంలోను, బంధు మిత్రులలోనూ ఆమె కొడుకు కలుగజేసిన వైనం అతనిదైన సృజనాత్మక కళాత్మక పనితనమనే చెప్పాలి. అది చూసి ఊరు ఊరంతా ఆ మహాతల్లి త్యాగం వూరికే పోతుందా అనే వారే అంతటా. తన మాతృమూర్తి ప్రేమను అతడు సెలబ్రేట్ చేయబూనే వైవిధ్య విధానానికి తెరలేపడం వలన అంతా మంత్రముగ్ధులయ్యేలా అది ఊరంతా పెద్ద చర్చనీయాంశంగా మారింది. అమ్మ అజెండా సాధనే ధ్యేయంగా పిల్లవాడి ప్రయాసకు అంతా జత కలిశారు.

యేసు ప్రాణ త్యాగం అచ్చు ఇలాంటిదే. సెలబ్రేట్! జీసస్ సెలబ్రేట్!

– జేతమ్

ఒకనాడు దేవుడు ఆజ్ఞాపించి చేయమన్న ఇహలోక భూ భౌతిక సంబంధ పండుగల కంటె మిన్నగా ఆత్మ సంబంధ పండుగను ఒకటి నిర్ణయించి నేడు ఉన్నతంగా ఆచరించమని తన గ్రంథం ద్వారా ఆజ్ఞాపిస్తున్నాడు. అదే క్రీస్తు పస్కా పండుగ. ఇది హృదయానందానికి సంబంధించినది. ఇది ఎక్కడా ప్రసిద్ధి చెందినట్టుగా బహు ప్రాచుర్యంలో ఉన్నట్టుగా లోకంలో కనబడదు. క్రీస్తు పస్కా పండుగ ఒకటి ఉందనేది లోకానికి తెలియదు. ఎందుకంటే ఇది ఆత్మసంబంధమైనది. దేవుని రాజ్యం దానిని పొందిన వారి అంతరంగానికి మాత్రమే అందే కార్యం. ఇది తన తోటి వారికి, పక్కవారికి, అన్యులకు ఏనాడూ అంతు చిక్కని కార్యం. ఇది జీవం గల దేవుని సంఘంలో క్రీస్తును బట్టి క్రీస్తు ద్వారా క్రీస్తునందు జరిగే ఉన్నతమైన కార్యక్రమం.


వారపు ప్రప్రథమ దినం అనే ప్రతి ఆదివారం నాడు యెడతెగక దేవుని ఆరాధనలో భాగంగా జరిగే రొట్టె విరుచుట అనేది క్రీస్తు బలియాగానికి గుర్తు. క్రీస్తు పస్కా బలి పశువుగా, వధకు సిద్ధమైన గొఱ్ఱెపిల్లగా అనాదిలోనే దేవుని చేత నిర్ణయించబడినవాడు. అది క్రీస్తు మరణంతో నెరవేరుటను నేడు మనం చూస్తున్నాం. క్రీస్తు వారి నలగగొట్టబడిన శరీరానికి గుర్తుగా రొట్టెను, మానవాళి కొరకు చిందించబడిన పవిత్ర రక్తానికి గుర్తుగా ద్రాక్షరసాన్ని... ఇలా రెండింటిని కృతజ్ఞతాపూర్వక ప్రార్థనలతో తీసుకుంటూ ప్రభువు వచ్చువరకు ఇలా చేస్తూ క్రీస్తు సిలువ యాగాన్ని గుర్తుకు తెచ్చుకుంటుంది క్రీస్తు ప్రభువు వారి సంఘం. నిజానికి ఇది భోజనం, పానం కాదు. నీతి, సమాధానం, పరిశుద్ధాత్మ సంబంధిత ఆత్మానందం ఇహమందు కాక ఈ లోక సంబంధులుగా కాక పరలోక సంబంధులుగా సంఘమనే దేవుని రాజ్యంలో జరుపుకొనే పండుగ. సంఘ భవనంలోనే ఇది జరిగినా కూడ సత్య లేఖనాల సారం ప్రకారంగా ఇది ఇహమందు అద్వితీయ సత్యదేవుడు, ఆయన నియమించిన రాజు ప్రధాన యాజకుడైన క్రీస్తు వారి సమక్షంలో జరిగే అత్యున్నత సంఘ కార్యక్రమం. సంఘం అంటే పరిశుద్ధులుగా ఉండుటకు పిలువబడిన వారని అర్థం. ఇట్టి ఆదివారపు దేవుని ఆరాధనతో సంఘం పరిశుద్ధంగా, ఆత్మ సంబంధంగా అన్నింటా బలపడుతూ ఉంటుంది.



ముత్తు నందిని ప్యాలెస్

ఇష్టాల ఇల్లు

రాజ్ చందర్ పద్మనాభన్, నాగ జయలక్ష్మి దంపతులు తమిళనాడు రాష్ట్రం, కన్యాకుమారిలో నివసించేవారు. సొంత ఇంటి కలను నెరవేర్చుకునే క్రమంలో వీరు అనుసరించిన విధానం ఇప్పుడు దేశమంతటినీ ఆకర్షిస్తోంది. పర్యావరణ ప్రేమికులనైతే మరీ ఎక్కువగా ఆకట్టుకుంటోంది. రెండేళ్ల కిందట గృహప్రవేశం చేసుకున్న కొత్త ఇల్లది. అయితే ఆ ఇంట్లో అడుగుపెడితే కాలం గిర్రున సినిమా రీల్‌లాగ వందేళ్ల వెనక్కి తిరిగిపోయిందా అనిపిస్తుంది. ఇంటిని చూడడానికి వచ్చిన వాళ్లను అతిథి మర్యాదలతో ముంచెత్తుతారు ఈ దంపతులు. సేంద్రియ పద్ధతిలో పండించిన దినుసులు, కాయగూరలతో సంప్రదాయ తమిళ, చెట్టినాడు వంటలను వడ్డిస్తారు.





నాగ జయలక్ష్మి, రాజ్ చందర్ పద్మనాభన్



పర్యావరణహిత భవనం ముత్తు నందిని ప్యాలెస్



ఎర్రమట్టి, సున్నపు రాయితో నిర్మించిన ఇంట్లో భూగర్భ జలాలను పరిరక్షించే ఏర్పాటు ఉంది. బంకమట్టి నిర్మాణం కావడంతో ఎండాకాలం చల్లగా ఉంటుంది. నేచర్ ఫ్రెండ్లీ ట్రావెల్‌ను ఇష్టపడే వాళ్లు ఇక్కడ బస చేస్తుంటారు. బస చేయకపోయినా చూసి పోవడానికి వచ్చేవాళ్లు కూడా ఎక్కువగానే ఉంటారు. ఈ కాలంలో ఇంటిని ఇలా ఎందుకు కట్టుకున్నారనే ప్రశ్న దాదాపుగా ప్రతి ఒక్కరి నుంచి ఎదురవుతుంటుంది. జయలక్ష్మి ప్రతి ఒక్కరికీ పూసగుచ్చినట్లు వివరిస్తుంటుంది.

బాల్యంలోకి వెళ్లారాయన!

"రాజ్‌చందర్ వృత్తిరీత్యా జియో డాటా అనలిస్ట్. ఆయనకు ఇష్టమైన రోజులంటే చిన్నప్పుడు వాళ్ల అమ్మమ్మ గారింట్లో గడిపిన బాల్యమే. పైగా రాజ్ అభిరుచి, విధి నిర్వహణ కూడా పర్యావరణవేత్తలతో కలిసి పని చేయడమే. ఈ రెండు ఇష్టాలను కలుపుతూ చక్కటి ఇల్లు కట్టుకోవాలని ఎప్పుడూ చెప్పేవారు. నాక్కూడా మా సంప్రదాయ నిర్మాణంలో ఉండే సౌందర్యం చాలా ఇష్టం. ఇద్దరి అభిరుచులూ కలవడంతో ఇంటిని ఇలా కట్టుకున్నాం. మా ఇద్దరి ఇష్టాల మేరకు ఎలా కట్టుకోవాలో ఒక ఐడియా వచ్చేసింది. ఎక్కడ కట్టాలనే విషయంలో ఒక అభిప్రాయానికి రావడం కొంచెం కష్టమే అయింది. లొకేషన్ సెర్చింగ్ మొదలు పెట్టాం.

సంజీవని శకలం

కన్యాకుమారికి సమీపంలో పోథయాడి గ్రామాన్ని చూసినప్పుడు కొండలు, పచ్చటి చెట్లతో ప్రదేశం బాగుందనిపించింది. ఆశ్చర్యంగా మరో విషయం తెలిసింది. అదేంటంటే... రామాయణంలో లక్ష్మణుడు మూర్ఛపోయినప్పుడు వైద్యం కోసం హనుమంతుడు ఏకంగా సంజీవని మొక్క ఉన్న పర్వతం అంతటినీ ఎత్తుకొచ్చాడని విన్నాం. వైద్యం చేసిన తర్వాత ఆ పర్వతాన్ని తిరిగి తీసుకెళ్లే క్రమంలో పర్వతంలోని ఒక శకలం విరిగి కింద పడి పోయిందని, ఆ శకలమే ఈ కొండ అని చెప్పారు స్థానికులు. వాళ్ల విశ్వాసాన్ని పక్కన పెడితే ఆ కొండమీద చుట్టుపక్కల ఉన్న మొక్కలన్నీ ఔషధ మొక్కలే. ప్రకృతితో మమేకమై నివసించడానికి మాకు ఇంతకంటే సౌకర్యవంతమైన ప్రదేశం మరోటి ఉండదేమో అనిపించింది. అంతే... 2021లో నిర్మాణం మొదలు పెట్టాం. ఒక ఏడాదిలో తమిళ, వేనాడు, చెట్టినాడు సంస్కృతుల సమ్మేళనమైన మా ఇంటి నిర్మాణం పూర్తయింది. సంప్రదాయ కళాకృతుల సేకరణ నా హాబీ. ఇంటిని తమిళ సంప్రదాయ సంస్కృతికి ప్రతీకగా మలిచాను. ఇంటి ముఖద్వారం నుంచి నేల, గోడ, మెట్లు, పై కప్పు, అలంకరణ వస్తువులు ప్రతి ఒక్కటీ తమ వైభవాన్ని తామే చెప్పుకుంటాయి. పర్యావరణ హితమైన సున్నపు పొడి ఇటుకలు, ఎర్ర మట్టి, ఆవుపేడ, ధాన్యం పొట్టు, కోడిగుడ్లు, బెల్లంతోపాటు అత్తంగుడి నది తీరాన దొరికే ఇసుకతో తయారు చేసే అత్తంగుడి టైల్స్‌ను వాడాం. పై కప్పుకి కాంక్రీట్ వాడకాన్ని తగ్గించి ఫిల్లర్ స్లాబ్ టెక్నిక్ ఉపయోగించాం. వర్షపు నీటిని నిల్వ చేయడానికి రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ పిట్, కరెంటుకోసం సోలార్ ప్యానెల్స్ పెట్టాం. ఈ మట్టి సౌధంలో 5 బెడ్ రూమ్‌లు, మూడు బాల్కనీలు, మూడు లివింగ్ స్పేస్‌లు ఉన్నాయి. ఇప్పటి వరకు రెండు వందల మందికి పైగా పర్యాటకులు ఈ హోమ్ స్టేలో బస చేశారు. ఆహారం కూడా తమిళనాట ప్రాంతాల వారీగా విలసిల్లిన విభిన్నమైన రుచులుంటాయి. ఇంటి ఆవరణలో అన్ని రకాల కూరగాయలనూ పండిస్తాం. వంటగదిలో వచ్చే వ్యర్థాలనే ఎరువుగా వేస్తాం" అని తమ పర్యావరణ హిత భవనం ముత్తు నందిని ప్యాలెస్ గురించి వివరించింది జయలక్ష్మి.

పరివర్తన

ఇప్పుడవి రాళ్లు విసిరే చేతులు కాదు

ఆ అమ్మాయి ఒకప్పుడు గుంపులో రాళ్లు విసిరే కశ్మీరీ అమ్మాయి. ఇప్పుడు జమ్ము-కశ్మీర్‌లో కేవలం బాలికల కోసం ఫుట్‌బాల్ అకాడెమీ నడుపుతున్న ప్రొఫెషనల్ ఫుట్‌బాల్ ప్లేయర్. ఆమెలో వచ్చిన మార్పు ఆమెను ప్రధాని నరేంద్ర మోదీ చేత కూడా మాట్లాడించేలా చేసింది. విరాట్ కోహ్లీ కూడా ఆమెను మెచ్చుకున్నాడు. యువతకు సరైన దిశ ఉంటే వారు గెలిచి తీరుతారనడానికి అఫ్షాన్ ఆషిక్ ఒక ఉదాహరణ.

కొన్నేళ్లు వెనక్కు వెళితే 2017 డిసెంబర్‌లో ఒక ఫోటో వైరల్ అయ్యింది. ఒకమ్మాయి... ముఖానికి దుపట్టా కట్టుకుని జమ్ము కశ్మీర్ పోలీసులపైకి రాళ్లు విసురుతున్న ఫొటో అది. ఆ అమ్మాయి పేరు అఫ్షాన్ ఆషిక్. ముఖం కనబడకుండా గుడ్డ కట్టుకోవడంతో తనను ఎవరూ గుర్తుపట్టరని అఫ్షాన్ భావించింది. కానీ తర్వాత ఆమె గురించి అందరికీ తెలిసిపోయింది. సమాజం ఆమెపై 'స్టోన్ పెల్టర్' ముద్ర వేసింది. అప్పటికే ఆ అమ్మాయి ఫుట్‌బాల్ ఆటలో ప్రతిభ కనపరుస్తూ ఉంది. కాని ఈ ఫోటోతో ఆమె తన ఆటకే దూరమయ్యే స్థితి వచ్చింది.

'ఆ రోజు నేను పోలీసుల మీద రాళ్లు రువ్వాను. అది కోపంలో చేసిన పని. దానికి కారణం పోలీసులు అకారణంగా మమ్మల్ని వేధించారు. విద్యార్థులను విచక్షణారహితంగా కొట్టారు. ఇలాంటి పరిస్థితుల్లో మమ్మల్ని మేము కాపాడుకోవడానికి రాళ్లు విసరడం మినహా మాకు గత్యంతరం లేదు. నేనేమి ప్రొఫెషనల్ స్టోన్ పెల్టర్‌ను కాదు. కాని నా మీద ముద్ర పడింది. దాని నుంచి బయటపడాలంటే నేను నా చదువు మీద నా ఫుట్ బాల్ ఆట మీద దృష్టి పెట్టి విజయం సాధించాలని అనుకున్నాను' అంది అఫ్షాన్ ఆషిక్.

ఈ ఘటన తర్వాత ఆ అమ్మాయి నెల రోజులు ఇంటికే పరిమితమైంది. అఫ్షాన్ తండ్రి ఆమెను ఇంటి నుంచి బయటకు వెళ్లనీయలేదు. అరగంటపాటు ఆడుకుని వచ్చేస్తానని తల్లికి మొరపెట్టుకున్నా ప్రయోజనం లేకపోయింది. 'ఒకరోజు చాలా ఏడుస్తుంటే నన్ను చూసిన నాన్న ఎందుకు ఏడుస్తున్నావని అడిగారు. ఇంట్లో కూర్చుని ఏం చేయాలని ప్రశ్నించాను. ఇంటి నుంచి బయటకు వెళ్లేందుకు అనుమతించడంతో మళ్లీ ఆట మొదలుపెట్టాను' అందామె.

ముంబై వెళ్లి

కశ్మీర్ యువత తమ చదువు, క్రీడల పట్ల దృష్టి పెట్టాలని భావించిన ప్రభుత్వం అఫ్షాన్‌ను తగిన ప్రోత్సాహం అందించింది. జమ్మూ కశ్మీర్ క్రీడాశాఖ చేయూతతో అఫ్షాన్ ముంబై వెళ్లి ఆటలో శిక్షణ తీసుకుంది. ఆ తర్వాత జమ్ము కశ్మీర్ నుంచి తొలి ప్రొఫెషనల్ ఫిమేల్ ఫుట్‌బాల్ ప్లేయర్ అయ్యింది. 'నువ్వు ఆడపిల్లవి. ఫుట్‌బాల్ నేర్చుకుని ఏం చేస్తావ్ అని అందరూ అడిగేవారు. నేను ఆడే సమయానికి ఆడపిల్లలు ఎవరూ మా ప్రాంతం నుంచి ఫుట్‌బాల్‌లోకి రాలేదు. కాని నేను ఆగలేదు. పట్టుదలగా ముందు కెళ్లాను. ఇండియన్ విమెన్స్ లీగ్‌లో ఆడాను. గోల్ కీపర్‌గా విశేష ప్రతిభ కనపరిచాను. ఆ సమయంలో విదేశీ మహిళా ఫుట్‌బాల్ ప్లేయర్లని గమనించాను. వాళ్లకు చాలా మంచిశిక్షణ ఆ దేశాల్లో లభిస్తోంది. మా ప్రాంతం బాలికలకు కూడా లభించాలని భావించాను. అందుకే జమ్ము కశ్మీర్ బాలికల కోసం యునీక్ ఫుట్‌బాల్ అకాడెమీ స్థాపించాను' అని తెలిపింది అఫ్షాన్.



అఫ్షాన్ ఆషిక్



ఆరోజుల్లో రాళ్లు విసురుతున్న అఫ్షాన్ ఆషిక్

మరింత గుర్తింపు

నేడు జమ్ము కశ్మీర్‌లో మహిళా ఫుట్‌బాల్ పేరు చెప్తే అఫ్షాన్ పేరే అందరికీ గుర్తుకొస్తుంది. ఆమెకు అక్కడ ఒక సెలబ్రిటీ హోదా ఉంది. 'నేను నా గతాన్ని జయించాను. ఇప్పుడు నేను స్టోన్ పెల్టర్‌ని కాను. గోల్ కీపర్‌ని. ఇకపై నన్ను జనం అలాగే గుర్తు పెట్టుకుంటారు' అంటుందామె.